

చట్టంగా మారిన ఆ పది బిల్లులు

గవర్నర్, రాష్ట్రపతి సంతకం లేకుండానే ఆమోదం ● గెజిట్ ప్రకటించిన ప్రభుత్వం

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ఆమోదించి పంపిన వివిధ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన బిల్లులు సహా మొత్తం 10 బిల్లులు చట్టరూపం దాల్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం గెజిట్ వెలువరించింది. దేశ చరిత్రలోనే తొలిసారిగా రాష్ట్ర శాసనసభలో ఆమోదించి పంపిన కీలకమైన 10 బిల్లులు రాష్ట్ర గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం లేకుండా, ఆ ఇరువురి సంతకాలు లేకుండా చట్టరూపం దాల్చడం ఇదే ప్రప్రథమమని ప్రభుత్వం పేర్కొంది. శాసనసభ ప్రతిపాదించిన బిల్లుల్ని ఆమోదించడానికి నిర్ణీత గడువును ప్రకటించడంతోపాటు ఆయనకంటూ కొన్ని ప్రవర్తన నియమావళిని కూడా తెలుపుతూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని పేర్కొంటూ... ఆ తీర్పు మేరకు 2023 నవంబర్ 18న ఈ బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపినట్లుగానే పరిగణించి, చట్టాలుగా మారినట్లు స్పష్టం చేసింది. ఈ బిల్లుల్లో విశ్వవిద్యాలయాలకన్నింటికీ ఇకపై రాష్ట్ర ముఖ్యమంత్రే ఛాన్సలర్‌గా వ్యవహరిస్తారంటూ చేసిన విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లుకూడా ఉండటం విశేషం. ప్రస్తుతం పది బిల్లులకు చట్టరూపం రావటంతో విశ్వవిద్యాలయాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాన్సలర్‌గా వ్యవహరించనున్నారని ప్రభుత్వం పేర్కొంది.



సుప్రీంకోర్టు తీర్పుతో చట్టరూపం దాల్చిన బిల్లులు ఇవే...

- రాష్ట్ర మత్స్య విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2020
- రాష్ట్ర వెటర్నరీ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2020
- రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు 2022
- డాక్టర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ చట్ట సవరణ బిల్లు 2022
- తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం(చెన్నై) చట్ట సవరణ బిల్లు 2022
- వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2022
- రాష్ట్ర విశ్వవిద్యాలయ చట్టాలు (రెండో సవరణ) బిల్లు 2022
- రాష్ట్ర విశ్వవిద్యాలయ చట్టాల సవరణబిల్లు 2022
- రాష్ట్ర మత్స్య విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2023
- రాష్ట్ర పశుసంవర్ధక విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లు 2023



రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకే

● అదో అవినీతి కూటమి
● అన్నాడీఎంకే - బీజేపీ పొత్తుపై స్టాలిన్ ధ్వజం

అడయార్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అవినీతిలో కూరుకుపోయి, రెండు ఈడీ తనిఖీలకే భయపడి అన్నాడీఎంకేను తాకట్టు పెట్టిన నేతలు.. ఇప్పుడు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టేందుకు ఆరాటపడుతున్నారని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధ్వజమెత్తారు. అన్నాడీఎంకే - బీజేపీ పొత్తే అవినీతిమయ కూటమి అంటూ ఘాటైన విమర్శలు చేశారు. వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్నాడీఎంకే - బీజేపీల మధ్య పొత్తు కుదిరిన విషయం తెల్సిందే. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన పలు విమర్శలను సీఎం స్టాలిన్ తిప్పికొట్టడమే కాకుండా ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ప్రకటన విడుదల చేశారు. అన్నాడీఎంకే - బీజేపీ కూటమి ఒక అపవిత్ర, పరాజయ కూటమిగా ఆయన అభివర్ణించారు. ఆ కూటమికి రాష్ట్ర ప్రజలు వరుస ఓటములను బహుమతిగా ఇచ్చారని, ఇదే కూటమికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇపుడు మళ్ళీ ప్రాణం పోశారన్నారు.

సీబీఐ ఎవరి చేతిలో ఉందో...

అసలు సీబీఐ అనే వ్యవస్థ ఎవరి అధీనంలో ఉందని సీఎం స్టాలిన్ ప్రశ్నించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో సీబీఐ ఏం సాధించిందని నిలదీశారు. కేంద్ర హోం మంత్రిగా ఉన్న అమిత్ షా.. తమిళనాడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇది మణిపూర్ కాదనే విషయాన్ని అమిత్ షాకు గుర్తు చేస్తున్నట్టు తెలిపారు. గత యేడాదిన్నరగా మణిపూర్‌లో జరిగిన అల్లర్లలో 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రంగా ఉన్న మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, శాంతి స్థాపనకు కృషి చేయలేని అమిత్‌షా.. శాంతివనంగా ఉన్న రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యానించడం సబబు కాదన్నారు.

ఆయన హోదాకు తగదు...

చెన్నై పర్యటనకు వచ్చిన హోం మంత్రి అమిత్ షా విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు ఆయన నిర్వహిస్తున్న హోదాకు తగినట్లుగా లేవన్నారు. ఆ రెండు పార్టీల మధ్య పొత్తు పెట్టుకోవడం అనేది వారి ఇష్టమని, అయితే, ఈ కూటమి ఎందుకోసం ఏర్పడిందో స్పష్టత ఇవ్వలేకపోయారన్నారు. అదే సమయంలో కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని (సీఎంపీ) రూపొందిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీస ఉమ్మడి కార్యక్రమంలో నీట్ రద్దు, హిందీని బలవంతంగా రుద్దడం, త్రిభాషా సూత్రం అమలు, వక్ఫ్ సవరణ చట్టం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో సీట్ల సంఖ్యను తగ్గించరాదు వంటి అంశాలను అందులో పొందుపరుస్తారా? అని ప్రశ్నించారు. పైగా విలేకరుల సమావేశంలో అన్నాడీఎంకే పెద్దలకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోగా, డీఎంకేను, డీఎంకే ప్రభుత్వాన్ని, తనను విమర్శించేందుకే ఉపయోగించుకున్నారన్నారు.

నీట్‌పై దాటవేత...

నీట్ రద్దుపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు అమిత్ షా సమాధానం చెప్పలేక.. నీళ్ళు నమిలారన్నారు. పైగా ప్రజలను తప్పుదారిపట్టించే అంశంగా అభివర్ణించారన్నారు. నీట్ రద్దు, ఈ పరీక్షల భయంతో 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే కాదని బిహార్‌లో ఉందన్నారు. వీరంతా కూడా నీట్ అంశాన్ని తప్పుదారి పట్టించేందుకే ఆత్మహత్యలు చేసుకున్నారా? అని ప్రశ్నించారు. గత యేడాది ఐదు రాష్ట్రాల్లో నీట్ నిర్వహణలో అవకతవకలు జరిగాయన్నారు. దీనిపై సీబీఐ విచారణ సాగించి కొందరు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను అరెస్టు చేసిందన్నారు.

అభివృద్ధి గణాంకాలు గుర్తులేవా?

రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొనడం వల్లే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్టు కేంద్ర గణాంకాలు నిరూపించాయని సీఎం గుర్తు చేశారు. అన్నాడీఎంకే - బీజేపీ కూటమి ఖరారైనట్టు ప్రకటించిన వేదికపై నుంచే అవినీతి గురించి హోంమంత్రి ప్రసంగించారన్నారు. అవినీతిమయమైన పార్టీ అన్నాడీఎంకే అనే విషయాన్ని అమిత్ షా గుర్తుతెచ్చుకోవాలన్నారు. ఆ పార్టీకి చెందిన మాజీ ముఖ్యమంత్రి జయలలిత అవినీతి కేసులో నాలుగున్నరేళ్ళ జైలు శిక్షను అనుభవించారన్నారు. అవినీతిలో కూరుకుని పోవడం వల్లే రెండు సోదాలతో నేటి అన్నాడీఎంకే నేతలు వణిపోతూ బీజేపీ పెద్దలకు లొంగిపోయారన్నారు. ఇపుడు ఏకంగా రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టాలని భావిస్తున్నారని మండిపడ్డారు. అన్నాడీఎంకే - బీజేపీ కూటమిని ఖరారు చేసిందే 'అవినీతి' అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా బాగా తెలుసన్నారు. రాష్ట్ర ప్రజలపై హిందీని బలవంతంగా రుద్దేందుకు, రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగించేందుకు, రాష్ట్ర హక్కులను కాలరాయడానికి భారతీయ జనతా పార్టీ అన్ని రకాలైన కుయుక్తులు పన్నుతూ, అన్నాడీఎంను బెదిరించి పొత్తును ఖరారు చేసుకుందన్నారు. అయితే, బీజేపీ ఒంటరిగా వచ్చినా, కూటమిగా వచ్చినా తమిళనాడు ప్రజలు తగిన గుణపాఠం నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నారని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.

మా కూటమితో స్టాలిన్‌కు వణుకు

● కంటిమీద కునుకు లేదు.. రాత్రంతా జాగారం
● ఈపీఎస్ ధ్వజం



చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో బీజేపీతో అన్నాడీఎంకే పొత్తుకుదుర్చుకున్న విషయం తెలిసినప్పటినుంచి డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ భయంతో వణికిపోతున్నారని, శుక్రవారం రాత్రంతా కంటిపై కునుకులేకుండా జాగారం చేశారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకేతో పొత్తును ఖరారు చేసుకున్న సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రెండు పార్టీల మధ్య ఉమ్మడి కార్యాచరణ పథకం ఏర్పడుతుందని ప్రకటించడం చూసి స్టాలిన్‌కు ఆ పథకం ఏమై ఉంటుందా అని గజగజలాడిపోయుంటారన్నారు. ఇటీవల స్టాలిన్ పార్టీ సర్వసభ్యమండలి సమావేశంలో మాట్లాడుతూ.. తెల్లారితే ఏం సమస్య వచ్చిపడుతోందననే భయంతో లేస్తున్నానని చెప్పారని, ఇదే తరహాలో రెండు రోజులకు ముందు రెండు మతాలను, మహిళలను కించపరిచేలా తన మంత్రి వర్గ సభ్యుడు పొన్ముడి చేసిన వ్యాఖ్యలు ఆయనకు నిద్ర లేకుండా చేసిందన్నారు. ఆ రీతిలోనే ప్రస్తుతం బీజేపీ, అన్నాడీఎంకే మధ్య పొత్తు ఖరారు కావడం కూడా భయాందోళనకు గురిచేసిందని పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు ఖరారైన వెంటనే రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను చక్కబరుస్తామని తాను ఎక్స్‌పేజీలో సందేశం వెలువరించినప్పుడే స్టాలిన్‌కు భయం పట్టుకుందన్నారు. బీజేపీ, అన్నాడీఎంకే మధ్య కుదిరిన ఎన్నికల పొత్తు కారణంగా రాత్రంతా కునుకు పట్టక జాగారం చేసిన స్టాలిన్ తెల్లవారగనే ఎప్పటిలా అసత్యాలతో ప్రకటనను వెలువరించి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ఈ ప్రకటనలోనూ మణిపూర్‌లో జరిగిన హింస గురించి ప్రస్తావించడం వింతగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, అత్యాచారాలను నిరోధించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా ఇతర రాష్ట్రాల్లో జరిగే సంఘటనలపై వ్యాఖ్యలు చేయడం గర్హనీయమన్నారు. నీట్ రాష్ట్రంలో ఎవరి వల్ల ప్రవేశించిందనే ప్రశ్నకు తొలుత సమాధానం ఇచ్చిన తర్వాతే స్టాలిన్ ఆ పరీక్షపై వ్యాఖ్యలు చేయడం మంచిదన్నారు. కావేరి నదీ జలాల హక్కులను బెంగళూరులోనూ, ముల్లై పెరియార్ డ్యాంపై రాష్ట్రానికి ఉన్న హక్కులను కేరళలోనూ తాకట్టు పెట్టేసిన ఘనత స్టాలిన్‌కే దక్కుతుందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వం ఎప్పుడూ రాష్ట్ర హక్కులు హరించుకుపోయేలా పరిపాలించలేదని తెలిపారు. స్టాలిన్ కల్లబొల్లి కబుర్లతో ప్రజలను మభ్యపెట్టేలా వెలువరిస్తున్న వీడియో రీళ్లకు శుభం కార్డు వేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఈపీఎస్ పేర్కొన్నారు.

పొన్ముడి వ్యాఖ్యలకు నిరసనగా 16న ధర్నా...

డీఎంకే నేతలు, మంత్రులు మహిళలను కించపరిచేలా, హేళనగా విమర్శించడం కొత్తకాదని, తాజాగా అటవీ శాఖ మంత్రి పొన్ముడి ఓ సభలో మహిళలను మాత్రమే కాకుండా శైవ, వైష్ణవమతాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం గర్హనీయమని ఈపీఎస్ అన్నారు. పొన్ముడి వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 16న పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో చెన్నైలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయ సభల్లో మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంలో డీఎంకే నేతలు, మంత్రులు ఒకరికొకరు ఏమాత్రం తీసిపోరన్నారు. డీఎంకే చరిత్రను పరిశీలిస్తే మహిళలంతా ముఖం ముడుచుకుని ఏవగించేలా మాట్లాడిన సందర్భాలే అత్యధికంగా ఉంటాయని ఈపీఎస్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే మహిళలను, శైవ, వైష్ణవ మతాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన పొన్ముడి వైఖరిని ఖండిస్తూ ఈనెల 16న సైదాపేట పానగల్ మాళిగై వద్ద మాజీ మంత్రి వలర్మతి నాయకత్వంలో ధర్నా జరుగుతుందని ఈపీఎస్ ప్రకటించారు.

బీజేపీ రాష్ట్ర చీఫ్‌గా నయినార్

● వానగరంలో అట్టహాసంగా నాగేంద్రన్ పదవీ స్వీకార మహోత్సవం

చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నయినార్ నాగేంద్రన్ శనివారం సాయంత్రం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్ష పదవికి ఆయన మాత్రమే నామినేషన్ సమర్పించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ జాతీయ కమిటీ ఎన్నికల ఇన్‌ఛార్జి తరుణ్‌సుక్ ప్రకటించారు. బీజేపీ వ్యవస్థాగత ఎన్నికలు గత మూడు నెలలుగా జరుగుతున్న విషయం విదితమే. శుక్రవారం అధ్యక్ష పదవికి ఎన్నిక జరగ్గా, నయినార్ నాగేంద్రన్ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడిగా నాగేంద్రన్ పేరు ఖరారైంది. ఆ మేరకు అధికారిక ప్రకటన చేయడానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెన్నైకి విచ్చేశారు. శనివారం సాయంత్రం వానగరం శ్రీవారు కల్యాణమండపం పార్టీ మహానాడును తలపించే ఏర్పాట్ల మధ్య నాగేంద్రన్ పదవీ స్వీకార మహోత్సవం జరిగింది. అన్నామలై స్వాగతోపన్యాసం చేశారు. తన కన్నా రెట్టింపు వయస్సు కలిగిన నేతలంతా తనకు అండగా నిలవడాన్ని మరువలేనని తెలిపారు. ఆ తర్వాత పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా నాగేంద్రన్ నామినేషన్‌ను అంగీకరించినట్లు ఎన్నికల అధికారి, బీజేపీ సీనియర్ నేత చక్రవర్తి ప్రకటించారు. ఆ తర్వాత పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగేంద్రన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభ్యుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. ఆ తర్వాత నాగేంద్రన్‌ను వేదికపైనున్న నేతలంతా శాలువలతో సత్కరించారు. తిరుపతి లడ్డూను తినిపించారు. కేంద్రమంత్రి ఎల్.మురుగన్, పార్టీ వ్యవహారాల కో-ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు తమిళిసై, కరునాగరాజన్, పొన్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



పదవీ స్వీకారం తర్వాత నయినార్ నాగేంద్రన్ అభివాదం

అన్నామలైకి కొత్త పదవి...

బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలైకి పార్టీ జాతీయ సర్వసభ్య మండలిలో స్థానం కల్పించారు. ఆ మండలి సభ్యులుగా కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, తమిళిసై సౌందరరాజన్, వానతి శ్రీనివాసన్, శరత్‌కుమార్, శశికళ పుష్ప, పొన్ రాధాకృష్ణన్ కూడా నియమితులైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా గత యేడాది కాంగ్రెస్ శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి బీజేపీలో చేరిన విజయధరణికి ఈసారి కూడా నిరాశే ఎదురైంది. బీజేపీలో తనకు పార్టీ పదవి లభిస్తుందనే చేరానని, తగిన సమయంలో పార్టీ తనకు తప్పకుండా మంచి పదవిని ఇస్తుందని పార్టీలో చేరిన తొలినాళ్లలో ఆమె చెప్పారు. అయితే బీజేపీ రాష్ట్ర వ్యవస్థాపక ఎన్నికలు ముగిసి, కొత్త అధ్యక్షుడి ఎంపిక కూడా పూర్తయినా పార్టీ అధిష్ఠానం విజయధరణిపై దృష్టిసారించలేదు. నయినార్ నాగేంద్రన్ పదవీ స్వీకార వేడుకల్లో ఆమె కూడా పాల్గొన్నారు. నాగేంద్రన్‌ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గుడిమెట్ల, మాడభూషికి ఘనసత్కారం

పార్రీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది పండుగ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాలను అందుకున్న నగరానికి చెందిన తెలుగు ప్రముఖులు గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ మాడభూషికి సంపత్‌కుమార్‌కు ఘన సత్కారం జరిగింది. స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు జరిగిన కార్యక్రమానికి నిర్వాహక కమిటీ చైర్మన్ కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి సారథ్యం వహించారు. సభ్యులు డాక్టర్ ఎం.వి. నారాయణగుప్తా స్వాగతం పలకగా, సభ్యులు విస్తాలి శంకర్‌రావు సభను ఆద్యంతం విజయవంతంగా నిర్వహించారు. ముందుగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సంస్థ సభ్యులు గుడిమెట్ల చెన్నయ్య, మాడభూషి సంపత్ కుమార్ తెలుగు భాషాభివృద్ధికి, సాహితీలోకానికి కృషి చేయడాన్ని గుర్తించిన ఏపీ సీఎం చంద్రబాబు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథి సినీగేయ రచయిత భువనచంద్ర మాట్లాడుతూ.. గుడిమెట్ల, మాడభూషి చెన్నైలోని తెలుగు సాహితీ హిమాలయాలని కొనియాడారు. వీరికి దక్కిన ఈ గౌరవం కమిటీకి దక్కిన గౌరవంగా భావించాలన్నారు. రాబోయే తరాలకు తెలుగు భాషా మాధుర్యాన్ని పంచిపెట్టేందుకు తెలుగువారంతా కృషిచేయాలన్నారు. అనంతరం వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి మాట్లాడుతూ.. తలరాత సరిగ్గావుంటే జీవితాలు సాఫీగా సాగుతాయన్నారు. ఈ సందర్భంగా కొన్ని తెలుగు పద్యాలను శ్రావ్యంగా ఆలపించారు. చివరగా సన్మానగ్రహీతలు మాట్లాడుతూ.. తమకు ఉగాది పురస్కారం అందజేసిన ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సన్మానగ్రహీతలకు నిర్వాహణ కమిటీ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు, ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందజేశారు. వేడుకల్లో భాగంగా రచయిత డి.తిరుమలస్వాతి రచించిన 'మాడభూషి కవిత్వానుశీలన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే ప్రముఖ గాయకుడు ఎంఆర్ సుబ్రమణ్యం బృందం నిర్వహించిన గానలహరి సినీ సంగీత విభావరి శ్రోతలను మైమరపించింది. నగరంలోని పలు తెలుగు సంస్థల ప్రముఖులు పాల్గొని సత్కారగ్రహీతలకు శాలువాలు కప్పి సన్మానించారు. సభ్యురాలు డాక్టర్ ఏవీ శివకుమారి వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.



గుడిమెట్ల చెన్నయ్య, మాడభూషి సంపత్‌కుమార్లను సత్కరిస్తున్న కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి, సినీగేయ రచయిత భువనచంద్ర తదితరులు

సమాచార ధ్వని

సిమ్లా, కులు, మనాలికి పర్యాటక యాత్ర

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి సిమ్లా, కులు, మనాలికి రైలు పర్యాటక యాత్ర పరిచయం చేస్తున్నట్టు శ్రీనివాస టూర్ ఆపరేటర్స్ యజమాని శేషాద్రి పేర్కొన్నారు. వేసవి సెలవుల సందర్భంగా దేశంలోని పలు ప్రాంతాలకు 14 రోజుల పర్యాటక యాత్ర మే 1, 12, 23 తేదీల్లో ఉంటుందన్నారు. తాజ్‌మహల్, మధుర, కృష్ణ జన్మభూమి, రిషికేష్ రామన్ ఝూలా, లక్ష్మణ్ ఝూలా, గంగా నదిలో పుణ్యస్నానం, గీతా భవన్, హరిద్వార్ లోని గంగా హారతి సందర్శన, సిమ్లా, కులు, మనాలి, అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్, పాకిస్తాన్ సరిహద్దులోని వాగా బార్డర్ తదితరాలు సందర్శించవచ్చు. 14 రోజుల పర్యటనలో రైలు, బస్సు, ఆహారం, బస తదితర ఛార్జీలు కలిపి ఒకరికి నాన్ ఏసీ రూ.23,000, ఏసీ ప్రయాణానికి రూ.26,000 ఛార్జీగా నిర్ణయించారు. వివరాలకు నెం.9384854561, 9384854569లలో సంప్రదించవచ్చు.

'కలైంజర్ కలం స్మారక అవార్డు'కు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 2024వ సంవత్సరానికి 'కలైంజర్ కలం స్మారక' అవార్డుకు ఈ నెల 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. యేటా కలైంజర్ కరుణానిధి జయంతి సందర్భంగా జూన్ 3వ తేది ఉత్తమ పాత్రికేయుడికి అవార్డు అందజేస్తుంటారు. అవార్డు గ్రహీతకు రూ.5 లక్షలు సహా ప్రశంసా పత్రం అందిస్తారు. రాష్ట్రానికి చెంది పాత్రికేయ రంగంలో 10 ఏళ్ల అనుభవం కలిగి సామాజిక, అణగారిన వర్గాల అభివృద్ధి, మహిళల అభ్యున్నతికి పాటుపడిన వారై ఉండాలి. తాము పనిచేస్తున్న సంస్థ ప్రతినిధి సిఫారసు, సంబంధిత పత్రాలతో దరఖాస్తును 'డైరెక్టర్, ప్రజా సమాచార శాఖ, సచివాలయం, చెన్నై-600009' అనే చిరునామాకు పంపాల్సి ఉంటుంది.

వెయ్యి ప్రాంతాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు

పెరంబూర్,ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రవ్యాప్తంగా 1,000 ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మహిళా మోర్చా జాతీయ కార్యదర్శి, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తెలిపారు. చెన్నైలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 11 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చిందన్నారు. ఆ ప్రకారం, 13వ తేది ఉదయం అంబేడ్కర్ విగ్రహాలు శుభ్రం చేయడం, సాయంత్రం విగ్రహం సమీపంలో దీపం వెలిగించనున్నామన్నారు. 14వ తేది ఉదయం విగ్రహానికి నివాళులర్పించనున్నామన్నారు. దళితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పార్టీ తరఫున సంక్షేమ సహాయాలు అందజేయనున్నామని తెలిపారు. 15 నుంచి 25వ తేది వరకు జిల్లా స్థాయిలో సదస్సులు, బహిరంగ సభలు నిర్వహించనున్నామని వానతి తెలిపారు.

'నమ్మ కోవై' యాప్ ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'నమ్మ కోవై' యాప్ అందుబాటులోకి తెచ్చారు. నగరంలో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు, మ్యూజియంలు, పోలీస్‌స్టేషన్లు, అగ్నిమాపక కేంద్రం, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హోటళ్లు, జిమ్ తదితర వివరాలు ఉన్నాయి. అలాగే, ఆస్తి పన్ను చెల్లింపు, జనన, మరణ ధృవీకరణ పత్రాలకు దరఖాస్తులు, భవన నిర్మాణాలకు అనుమతి, కార్పొరేషన్ కల్యాణ మండపాల్లో వివాహాలు చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

కొత్త బస్సుల సేవలు ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా సంస్థ ఆధ్వర్యంలో 8 కొత్త మార్గాల్లో బస్సు సేవలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చెంగల్పట్టు - తిరుపతి (నెం.212 హెచ్) మధ్య రెండు బస్సులు, చెంగల్పట్టు - మహాబలిపురం (నెం.టి 508బి), చెంగల్పట్టు - తాంబరం (నెం.టి60బి), తాంబరం - బెంగళూరు (నెం.444 టీకే), మధురాంతకం - సెయ్యూరు (నెం.టి7బి), తాంబరం - బెంగళూరు (444 టీహెచ్), కిలాంబాక్కం - మన్నివాక్కం (నెం.55బి) మార్గాల్లో బస్సు సేవలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

టీఎన్‌పీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'తిరుమావయిలగం' ఆధ్వర్యంలో టీఎన్‌పీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఈ నెల 27వ తేది నుంచి ప్రారంభమవుతుందని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. స్థానిక అశోక్‌నగర్ అంబేడ్కర్ మైదానం సమీపంలో పని చేస్తూ ఈ కేంద్రంలో నిర్వహించనున్న శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు THIRUMAPAYILAGAM@GMAIL.COM లోకానీ, నెం.8610392275 (చెన్నై)లో సంప్రదించవచ్చు.

మూడు జిల్లాలకు భారీ వర్షసూచన

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నీలగిరి, తెన్‌కాశి, దిండుగల్ జిల్లాల్లోని ఒకట్రెండు ప్రాంతాల్లో రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, ఈనెల 18 నుంచి 28వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌ల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువనున్నాయి. అదే సమయంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2-3 డిగ్రీలు పెరిగే అవకాశముంది. చెన్నైలో ఆకాశం కొంత మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 37-38, రాత్రి ఉష్ణోగ్రతలు 27-28 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఆర్మీలో చేరేందుకు గడువు పొడిగింపు

ప్యారీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ 'అగ్నివీర్‌'లో సైనికుల ఎంపిక దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 25వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షా ఫీజు రూ.250. క్రెడిట్, డెబిట్ కార్డులు, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు. ఆన్‌లైన్‌లో నిర్వహించే ప్రవేశ పరీక్ష సహా దేహదారుఢ్య, మెడికల్ టెస్ట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. వివరాలకు సెయింట్ జార్జి కోట ప్రాంగణంలోని సైనిక ఎంపిక కార్యాలయంలో కానీ, నెం. 044-25674924లో సంప్రదించవచ్చు.

వానగరంలో కొత్త పోలీస్ స్టేషన్ ప్రారంభం

ప్యారీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు పోలీసు జిల్లా పరిధిలో ని మధురవాయల్ పోలీస్‌స్టేషన్‌ను నిర్వహణ వసతి, ప్రజల సంఖ్య పెరిగిన కారణంగా నేరాలు అదుపు చేసేలా మధురవాయల్, వానగరం పోలీస్‌స్టేషన్లుగా విభజించారు. ఆ ప్రకారం, వానగరంలో కొత్త పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం నగర పోలీసు శాఖ అదనపు కమిషనర్ ప్రవేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ స్టేషన్ తొలి ఇన్‌స్పెక్టర్‌గా మహేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో చెన్నై వెస్ట్ జోన్ జాయింట్ కమిషనర్ కల్యాణ్, కోయంబేడు డిప్యూటీ కమిషనర్ అతివీర పాండ్యన్, అసిస్టెంట్ కమిషనర్లు బాలకృష్ణప్రభు, సెంపెడు బాబు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ ప్రారంభిస్తున్న అదనపు కమిషనర్ ప్రవేష్‌కుమార్

ఏఐ పరిజ్ఞానంతో చేపాక్కం మైదానం పర్యవేక్షణ

● గ్రేటర్ చెన్నై పోలీసు

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పోటీలు జరుగుతున్న చేపాక్కం మైదానం, పరిసర ప్రాంతాలను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతి పరిజ్ఞానం వినియోగించి భద్రత పర్యవేక్షిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ తెలిపింది. స్థానిక చేపాక్కం మైదానంలో శుక్రవారం జరిగిన చెన్నై- కోల్‌కతా మ్యాచ్ సందర్భంగా నగర పోలీసు జాయింట్ కమిషనర్ విజయకుమార్, అసిస్టెంట్ కమిషనర్ జయచంద్రన్ విలేకరులతో మాట్లాడుతూ... చేపాక్కం మైదానం, పరిసర ప్రాంతాల్లో 252 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా స్టేడియంలో అభిమానుల కార్యకలాపాలు, మైదానం వెలుపల, పరిసర ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ పర్యవేక్షణలో ఏఐ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తుండడంతో, ప్రతిఒక్కరి చర్యలు పరిశీలించేందుకు వీలవుతుందన్నారు. వారిలో సందేహాస్పదంగా ఉన్న వ్యక్తులను గుర్తించి, వారి ముఖం, దుస్తులు, రంగు ఆధారంగా స్టేడియంలో ఏ ప్రాంతంలో ఉన్నా పర్యవేక్షించేందుకు వీలవు తుందన్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన మ్యాచ్ సందర్భంగా ఒకే రోజు 28 సెల్ ఫోన్లు చోరీకి గురైన వ్యవహారంలో, నిందితులను అరెస్ట్ చేసేందుకు ఈ పరి జ్ఞానం ఉపయోగపడిందని, త్వరలో మరో ముఠాను కూడా అరెస్ట్ చేయను న్నామని తెలిపారు.

మేట్టుపాళయంలో వీకేసీ షోరూం ప్రారంభం



చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో వీకేసీ సంస్థ తన 17వ 'మై వీకేసీ' స్టోర్‌ను ప్రారంభించింది. ఫ్రాంచైజీ యజమాని అక్బర్ కుటుంబీకులు ఈ షోరూంను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేట్టుపాళయం మున్సిపల్ చైర్మన్ ఎ.మెహరిటా పర్వీన్ అష్రఫ్ అలీ, పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్న కామనన్, ఎస్‌ఎం అనీఫా అండ్ సన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌ఎం వజీర్ అహ్మద్, వీకేసీ ఇండియా డైరెక్టర్లు ఎం.బాబు, ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మై వీకేసీ, ఓన్లీ వీకేసీ స్టోర్ల ద్వారా భారతీయ టైర్ 2, 3 నగరాలు, పట్టణాలకు, గ్రామీణ ప్రాంతాలకు కూడా సమకాలీన ప్రపంచ ఫ్యాషన్‌ను తీసుకురావడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం


నూతన బస్సు పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే

వేలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తం, పేర్నాంబట్ తదితర ప్రాంతాల్లోని ప్రజల అభ్యర్థన మేరకు శనివారం ఉదయం ఆ ప్రాంత ఎమ్మెల్యే అమ్ములు విజయన్ ఐదు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... వేలూరు, గుడియత్తం నుంచి బెంగళూరుకు ఇప్పుడున్న బస్సు సర్వీసులకు అదనంగా మరో ఐదు బస్సులను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడియత్తం డీఎంకే అధ్యక్షుడు సౌందరరాజన్, రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు సంస్థ జనరల్ మేనేజర్ గణపతి, జగన్నాథన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో మజ్జిగ కేంద్రం



వేలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వేలూరు కాట్పాడిలోని 49వ వార్డు కేకేనగర్‌లోని మసీదువీధి ప్రాంతంలో మజ్జిగ కేంద్రాన్ని ఆ పార్టీ నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేలూరు నగర ఎస్‌డీపీఐ అధ్యక్షుడు రియాజ్ రెహ్మాన్ మాట్లాడుతూ.. ఎండల వేడికి తట్టుకునేందుకు ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. తమవంతు సాయంగా మజ్జిగ కేంద్రాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 49వ వార్డు అధ్యక్షుడు మహ్మద్ బాషా, పార్టీ కార్యకర్తలు జాఫర్, సత్‌కల్లు, నంద, ఫైజాన్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

అయాన్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం


ప్రారంభోత్సవంలో వేలూరు మేయర్ సుజిత ఆనందకుమార్ తదితరులు

వేలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపంలోని సెన్‌బాక్కం నేషనల్ హైవే సమీపంలోని సెల్వవినాయగర్ వీధిలో అయాన్ ఫిట్‌నెస్ సెంటర్‌ను శనివారం ఉదయం ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథులుగా వేలూరు మేయర్ సుజిత ఆనందకుమార్, 32వ వార్డు సభ్యురాలు షాజిదా, పోలీసు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అక్బర్, అబ్దుల్ మాలిక్, షరీఫ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి


సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి తదితరులు

వేలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాంబట్టి మండలం ఎరుకమ్‌పట్టి లోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉదయం సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్న వయసు నుంచే వివిధ సైన్స్ ఆవిష్కరణలతో ముందుకెళ్తున్న ఆ పాఠశాల విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధార్థ పాఠశాల 43వ వార్షికోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

వేలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు కోట్టైరోడ్డు, పోలీస్ సంక్షేమ బోర్డు కార్యాలయం సమీపంలోని సిద్ధార్థ సెకండరీ పాఠశాలలో శనివారం ఉదయం 43వ వార్షికోత్సవాన్ని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిద్ధార్థ నంబి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వాహించారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా కో-ఆపరేటివ్ సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ అయ్యప్పదురై పాల్గొని పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇంట్లో మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్



వేలూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియత్తం సమీపంలోని కమ్మపల్లిలోని ఓ ఇంట్లో మద్యాన్ని విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారమందింది. దీనితో శనివారం ఉదయం అనుమానిత ఇళ్లపై దాడులు నిర్వహించిన పోలీసులు ఇంట్లో మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, విజయ్‌ని, ఆయన మిత్రులు వెంకటేశన్, మదన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ ముగ్గురు ఆంధ్రప్రదేశ్ నుంచి చీప్ లిక్కర్, బీర్లు, బ్రాందీలను తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు తేలింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

వేలంలో రూ.32 వేలు పలికిన పది నిమ్మకాయలు

ప్యారీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరు సమీపంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలో ఉంచిన 10 నిమ్మకాయలను వేలం ద్వారా సంతానంలేని పలువురు దంపతులు రూ.32 వేలకు సొంతం చేసుకున్నారు. తిరువెన్నైనల్లూరు సమీపంలోని వరనందన్ గ్రామంలో కొలువై ఉన్న ఆలయలో శూలాయుధమే మూలమూర్తిగా నిత్యపూజలందుకుంటోంది. ఈ ఆలయంలో యేటా చైత్రమాసంలో పంగుణి ఉత్తిరై ఉత్సవాలను కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఈనెల 1వ తేదీన ధ్వజారోహణంతో ఈ ఉత్సవాలు ప్రారంభం కాగా, ప్రతిరోజు ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. 7వ తేదీ తిరుకల్యాణం, 9వ తేదీన రథోత్సవం, 10వ తేదీన కావడి పూజ, శుక్రవారం రాత్రి 11గంటలకు అగ్నిగుండ ప్రవేశ పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని గర్భగుడిలోవున్న వేలాయుధానికి గుచ్చిన నిమ్మకాయలను శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేలం వేశారు. తొలిరోజు నిమ్మకాయను సేలం జిల్లాకు చెందిన కలైమామని రూ.2వేలకు, రెండో రోజు కాయను వేలూరు శ్రీనివాసన్- శశికళ దంపతులు రూ.3,600కు, తొమ్మిదవ రోజు నిమ్మకాయను వెన్నైనల్లూరుకు చెందిన నాగరాజు దంపతులు రూ.1,700లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.


నిమ్మకాయలను దంపతులకు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఎన్డీఏ కూటమికే మా మద్దతు

● టీటీవీ దినకరన్



ప్యారీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అవినీతి డీఎంకే పాలన రాష్ట్రంలో కొనసాగరాదని, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్న లక్ష్యంతోనే తాము ఎన్డీఏ కూటమికి మద్దతుగా నిలిచామని అమ్మా మక్కల్ మునేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. నగరంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... దివంగత మాజీ సీఎం జయలలిత కార్యకర్తలు ఎక్కడున్నా ఒకే గూటికిందకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న డీఎంకేను గద్దెదించాలన్న లక్ష్యంతో అందరూ ఏకమవుతారని తాను గతంలో చెప్పిన మాట ప్రస్తుతం నిజమైందన్నారు. ఎన్డీఏ కూటమి మహా సముద్రమన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే నేతృత్వంలో ఎన్డీఏ కూటమి పనిచేస్తుందని బీజేపీ సీనియర్ నేత అమిత్‌షా అధికారికంగా ప్రకటించారని తెలిపారు. ఎన్నికల పొత్తుకు సంబంధించి అన్నాడీఎంకే నేతలెవరూ తనను సంప్రదించలేదని దినకరన్ తెలిపారు.

దివ్యాంగుడికి నాలుగుచక్రాల స్కూటర్ పంపిణీ


దివ్యాంగుడికి నాలుగుచక్రాల స్కూటర్‌ను పంపిణీ చేస్తున్న మాజీమంత్రి షణ్ముగం

తిరుత్తణి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని పండ్రవేడులో అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ.షణ్ముగం ఆధ్వర్యంలో దివ్యాంగులకు నాలుగుచక్రాల స్కూటర్ల పంపిణీ కి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో పండ్రవేడువాసి కరుణాకరన్‌కు స్కూటర్‌ను సీవీ.షణ్ముగం అందించారు. ఈ సందర్భంగా షణ్ముగం మాట్లాడుతూ, పార్లమెంట్ నియోజకవర్గ సంక్షేమ నిధి నుంచి పేద వికలాంగులకు బైక్‌లను పంపిణీ చేశామన్నారు. మాజీ ఎంపీ శ్రీనివాసన్, తిరుత్తణి కార్యదర్శి వెలంచెరి పళని, నగర సభ్యులు కేబుల్ సురేష్, నాగూర్ పిచాయి, మునుస్వామి, ఐటీ విభాగం ప్రభ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సారీ...!

● మంత్రి పొన్ముడి బేషరతు క్షమాపణలు



చెన్నై, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో ఇటీవల తంథైపెరియార్ ద్రావిడర్ కళగం ఆధ్వర్యంలో జరిగిన సభలో తాను చేసిన వ్యాఖ్యలతో బాధపడినవారందరికీ బేషరతుగా క్షమాపణలు తెలుపుకుంటున్నానని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పొన్ముడి ప్రకటించారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన వెలువరించారు. సుదీర్ఘమైన రాజకీయ అనుభవం కలిగిన తనకు ఇలాంటి తడబాటు ఏర్పడంపై చింతిస్తున్నానని, పలువురి మనస్సును కించపరిచేలా తన వ్యాఖ్యలు ఉన్నాయని తెలుసుకుని తలవంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంపై దిగులు చెందానని తెలిపారు. తన వ్యాఖ్యల వల్ల బాధపడినవారందరికీ క్షమాపణలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు. పలు వర్గాలవారిని కించపరిచేలా తన వ్యాఖ్యలు ఉన్నట్లు గ్రహించి తాను ఎంతో బాధపడ్డానని తెలిపారు.

అన్నానగర్ టవర్ వద్ద గస్తీ పటిష్ఠం

వాషర్‌మెన్ పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నానగర్ టవర్ పార్కుకు వచ్చే మహిళల పట్ల కొందరు యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో గస్తీని మరింత పటిష్ఠం చేసినట్లు పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ తిరుపతి చెప్పారు. అన్నానగర్‌లో ఉన్న 12 అంతస్తుల టవర్ పైకి ఎక్కి చెన్నైనగర అందాలను వీక్షించడంలో ఉన్న మజాయే వేరు. మరోవైపు జిగేలుమనిపించే విద్యుద్దీపాల అలంకరణ, పచ్చని పూల మొక్కలు, చల్లని నీటిబుగ్గల ఆహ్లాదాన్ని ఆస్వాదించడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. 2011లో టవర్ ఎక్కి ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో 10 ఏళ్లపాటు ప్రజల సందర్శనాన్ని నిషేధించారు. 2023లో ప్రజల సందర్శనానికి అనుమతించారు. ఇదిలా ఉండగా 2024, ఆగస్టులో ఓ వ్యక్తి టవర్ ఎక్కి ఆత్మహత్య బెదిరింపు చేశాడు. దీంతో అధికారులు టవర్‌కు మళ్లీ తాళాలు వేశారు. దీంతో టవర్ పోలీసుల అధీనంలోకి వెళ్లింది. అయితే టవర్‌లోకి సందర్శకులను అనుమతించాలని ప్రజల నుండి వినతి పత్రాలు వెల్లువెత్తడంతో, చేసేదిలేక అధికారులు తెరిచారు. ఇదిలా ఉండగా, టవర్ సమీపంలో ఉన్న పార్కుకు వస్తున్న ప్రేమికులను లక్ష్యంగా చేసుకుని కొంతమంది వారిని వేధించడమేగాక, వారిపై దాడి చేస్తున్నారు. దాంతో అన్నానగర్ పోలీసు అసిస్టెంట్ కమిషనర్ తిరుపతి స్వయంగా రంగంలోకి దిగారు. పార్కు వద్ద గస్తీని పటిష్ఠం చేయించారు. సాయంత్రం వేళల్లో రొటేషన్ పద్ధతిలో నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. పార్కు చుట్టూ 70 సీసీ కెమెరాలను అమర్చాలని ఆదేశించారు.

రంగులరాట్నం నుంచి జారి పడిన యువతి


రాట్నంపై వేలాడుతున్న యువతి

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రంగులరాట్నంపై కేరింతలు కొడుతున్న యువతి హఠాత్తుగా జారిపడింది. పంగుణి పొంగల్ సందర్భంగా విరుదునగర్‌లోని ఓ ప్రైవేటు మైదానంలో జరుగుతున్న ఎగ్జిబిషన్‌లో శుక్రవారం రాత్రి రంగుల రాట్నం (తల్లకిందులుగా తిరిగే రాట్నం) ఎక్కిన కౌసల్య (22) ఊహించని విధంగా సీటు నుంచి జారింది. ఆ సమయంలో రాట్నం ఆపేందుకు వీలులేకపోవడంతో పలు రౌండ్లు ఆమె వేలాడుతూనే ఉంది. అంతలోనే ఆమె రాట్నం నుంచి జారిపడింది. ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఆమెను వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురు అరెస్ట్

● రూ.1.9 కోట్లు స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పోటీల్లో భాగంగా శుక్రవారం చెన్నై - కోల్‌కతా మధ్య మ్యాచ్ జరిగింది. ఈ నేపథ్యంలో, కోయంబత్తూర్‌లో ఐపీఎల్ బెట్టింగ్ జరుగుతున్నట్టు అందిన సమాచారంతో కొట్టూరు పోలీసులు దాడి చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న రాజేష్, సౌందర్, అరుణ్‌కుమార్, నందకుమార్, విపుల్, జితేంద్ర, విబిన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1.9 కోట్ల నగదు, 12 మొబైల్‌ఫోన్లు, రెండు కార్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

కుక్క కాటుతో విద్యార్థి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురైన విద్యార్థి మృతి చెందాడు. కుండ్రత్తూర్ యూనియన్ వడక్కుపట్టు పంచాయతీ న్యూ కాలనీకి చెందిన శివశంకర్ కుమారుడు విశ్వ (13) 8వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 7వ తేది ఇంటి ముందు ఆడుకుంటున్న అతన్ని కుక్క కరిచింది. కుటుంబ సభ్యులు రెడ్డిపాళయం పీహెచ్‌సీలో చికిత్సలందించి ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో, గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో విశ్వ కడుపునొప్పి, తలనొప్పితో బాధపడుతుండడంతో ఒరగడంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యచికిత్సలకు శ్రీ పెరంబుదూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్సలు ఫలించక శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు.

తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం


సముద్రం వెనక్కి వెళ్లడంతో బయల్పడిన పాచితో కూడిన రాళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం వెనుక వైపున్న సముద్రం హఠాత్తుగా 70 అడుగుల వెనక్కి వెళ్లింది. పౌర్ణమి, అమావాస్య రోజుల్లో తిరుచెందూర్ ప్రాంతంలోని సముద్రం వెనక్కి వెళ్లడం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం సముద్రం హఠాత్తుగా 70 అడుగుల వెనక్కి వెళ్లింది. పాచిపట్టిన రాళ్లు, వాటి మధ్య పలురకాల సముద్ర జీవులు కనిపించాయి. రాళ్లపై నిలబడి సెల్ఫీలు తీసుకున్నారు. కొద్దిసేపటి అనంతరం సముద్రం యథాస్థితికి చేరుకుంది.

భార్య ఆత్మహత్య

● తట్టుకోలేక ఉరేసుకున్న భర్త

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్యను తట్టుకోలేని భర్త కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరునల్వేలి జిల్లా రాధాపురం సమీపం సమూహరంగాపురం శ్రీలంక తమిళుల శిబిరంలో ఉంటున్న త్యాగరాజన్ కుమార్తె గీత (23)కు తిరుచ్చి కొట్టాంపట్టిలోని శ్రీలంక శరణార్థుల శిబిరంలో నివసిస్తున్న నందకుమార్ (30)కు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. మద్యానికి బానిసైన నందకుమార్ రోజూ మద్యం తాగి ఇంటికొచ్చి గొడవపడుతుండేవాడు. మద్యం మానాలని ఎంత చెప్పినా భర్త వినకపోవడంతో గీత మూడేళ్లుగా తల్లిదండ్రుల ఇంట్లోనే ఉంటోంది. శుక్రవారం గీత ఇంటికి నందకుమార్ వచ్చాడు. ఆ సమయంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. గీత ఆగ్రహంతో రసాయనం తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్సలు ఫలించక మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న నందకుమార్ ఉరేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు మట్టల ఆదివారం.. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


ప్యారీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నేడు మట్టల ఆదివారం సందర్భంగా చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఊరేగింపుల్లో క్రైస్తవులు పాల్గొననున్నారు. యేసుక్రీస్తు శిలువపై ప్రాణాలు కోల్పోవడానికి ముందు జెరూసలేం పట్టణాన్ని ఆయన సందర్శించిన సమయంలో, అక్కడి ప్రజలు ఆయన్ను గాడిదపై కూర్చొబెట్టి, ఈత మట్టలు చేతబట్టి 'హోసన్నా... హోసన్నా' అంటూ ఊరేగించారని బైబిలు చెబుతోంది. ప్రస్తుతం ఈస్టర్ పండుగ సందర్భంగా ఉపవాసం ఉంటున్న క్రైస్తవులు, ఈనెల 13న మట్టల ఆదివారంగా జరుపుకోనున్నారు. పలు చర్చీల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు ఈత మట్టలు చేతబట్టి వీధుల్లో తిరుగుతూ 'హోసన్నా... దావీదు తనయా హోసన్నా..' అంటూ పాటలు పాడుతూ ర్యాలీ చేపట్టనున్నారు.



వాననీటి కాల్వ మ్యాన్‌హోల్‌ను దోమల నివారణ మందుతో తడిపిన వలను అమర్చుతున్న పారిశుధ్య కార్మికులు



రసాయన వలతో మ్యాన్‌హోల్‌ను మూస్తున్న కార్మికులు





వలను కత్తిరిస్తున్న కార్మికులు



మ్యాన్‌హోల్‌పై మూత పెడుతున్న కార్మికులు

SUNDAY SPECIAL

వేస్ట్ గ్లూకోజ్ బాటిళ్లతో

దోమలపై సమరం

- క్యూలెక్స్ దోమల గుడ్ల నాశనానికి కెమికల్ ఆయిల్
- అంబత్తూరు జోన్‌లో ప్రయోగం

అంబత్తూరు జోన్‌లో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇళ్లలో సాయంకాలం గాలి కోసం కిటికీలు తెరిస్తే చాలు దోమలు చొరబడి రక్తం పీల్చుతుంటాయి. ఎండకాలం ప్రారంభంకావటంతో ప్రస్తుతం దోమల బెడద మరీ ఎక్కువైంది. రాత్రివేళల్లో దోమల దాడిని తట్టుకోలేక ఉక్కపోతతో ఇళ్లలో నరకం అనుభవించాల్సి వస్తోందని స్థానికులు వాపోతుంటారు. దోమలబాధకు తోడు కరెంటు పోతే ఇబ్బంది పడాల్సి వస్తోందంటున్నారు. అంబత్తూరు పరిసర ప్రాంతాల్లో గత నెలరోజులుగా ఈ దోమల సమస్య తీవ్రమైంది. వాటి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు గ్రేటర్ చెన్నై అధికారులకు వినతి పత్రాలు సమర్పించడంతో కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారులు సమరానికి సన్నద్ధమయ్యారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

కాల్వల వద్దే దోమల గుడ్ల నాశనం..

దోమల నివారణకు మందుల పిచికారీ, గాంబూసియా చేపలను వదలడటం, మురుగు నీటి నిల్వలున్న ప్రాంతాల్లో దోమల సంతానోత్పత్తిని నివారించే కెమికల్ ఆయిల్‌ని ఉపయోగిస్తున్నారు. ఇటీవల అంబత్తూరు జోన్ ప్రజారోగ్య విభాగం అధికారులు జరిపిన పరిశీలనలో అంబత్తూరు, కొరట్టూరు, పాడి ప్రాంతాలలో క్యూలెక్స్ దోమలు అధికంగా ఉన్నాయని వెల్లడైంది. దీంతో పారిశుధ్య కార్మికులను రంగంలోకి దించి మందుల పిచికారీ, ఫాగింగ్ జరిపి మురుగు కాల్వలు, నీటి నిల్వలున్న ప్రాంతాల్లో దోమల గుడ్లను కెమికల్ ఆయిల్ ద్వారా నశింపజేస్తున్నారు. మురుగు, వాననీటి కాలువల వద్ద దోమలు అధికంగా సంచరిస్తుండటంతో వేస్ట్ గ్లూకోజ్ బాటిళ్లలో కెమికల్ ఆయిల్‌ను నింపి వేలాడదీస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ కార్మికులు ఇంటింటికీ వెళ్ళి నీటి నిల్వలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ వద్ద దోమల నివారణ నూనె (మస్కిటో టార్విసైడ్స్ ఆయిల్) తడిపిన దోమ తెరలాంటి గుడ్డను కప్పి, దానిపై సిమెంట్ మూతను పెడుతున్నారు. అంతే కాకుండా డ్రోన్లతో దోమల నివారణ రసాయనాలను పిచికారీ చేస్తున్నారు.

గ్లూకోజ్ బాటిళ్ల వినియోగం...

అంబత్తూరు జోన్‌లో మురుగు కాల్వల అంచున, వాననీటికాల్వల అంచున దోమల ఉత్పత్తి జరగకుండా కార్మికులు దోమల నివారణ నూనెను, రసాయనాలను వాడుతున్నారు. వీటికోసం ఆస్పత్రుల్లో వినియోగించి పారవేసిన ప్లాస్టిక్ గ్లూకోజ్ (సెలైన్) బాటిళ్లను వందల సంఖ్యలో తెప్పించి వాడుతున్నారు. ఈ ప్లాస్టిక్ బాటిళ్లలో ద్రవరూపంలో ఉన్న దోమల నివారణ మందును సన్నటి ప్లాస్టిక్ నాళం ద్వారా కాల్వల అంచుల్లో చుక్క చుక్క కారేలా చేస్తున్నారు. ఆ నూనె కారిన చోట క్యూలెక్స్ దోమలు గుమికూడి గుడ్లు పెడతాయని, ఆ గుడ్లన్నీ పావుగంటలోపే నూనెలో కలిపిన రసాయనాల ప్రభావంతో నాశనమవుతాయని అధికారులు తెలిపారు. ఈ బాటిల్‌లో నింపిన రసాయనిక ద్రవం రాత్రంతా సన్నటి ప్లాస్టిక్ నాళం ద్వారా కారుతుంటుందని, బాటిల్ ఖాళీ అయ్యాక మళ్ళీ కెమికల్ ఆయిల్‌తో నింపుతారని చెప్పారు. నెల రోజులుగా కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ఈ తరహాలో దోమల నివారణ పనులు చేపట్టడంతో అంబత్తూరు, కొరట్టూరు, పాడి ప్రాంతాల్లో యాభైశాతానికి పైగా దోమలబెడద తప్పిందంటున్నారు. మరికొద్ది రోజులపాటు దోమల నిరోధక చర్యలు కొనసాగిస్తామని కార్పొరేషన్ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారి తెలిపారు.



ఓ మురుగు కాల్వ ప్రహరీపై కెమికల్ ఆయిల్ ఉన్న ప్లాస్టిక్ బాటిల్‌ను కడుతున్న కార్మికుడు



వేస్ట్ గ్లూకోజ్ బాటిళ్లలో కెమికల్ ఆయిల్ నింపుతున్న కార్మికులు

జీఆర్‌టీకి 'ప్లాటినం ఛాంపియన్స్ లీగ్'లో ఆరు ప్రతిష్ఠాత్మక టైటిళ్లు



ట్రోఫీని అందుకుంటున్న జీఆర్‌టీ సిబ్బంది

వాషర్‌మెన్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆభరణాల రంగంలో తన ప్రతిష్ఠను నిలుపుకుంటున్న జీఆర్‌టీ జ్యువెలర్స్ బంగారం, వజ్రం, ప్లాటినం, వెండి, రత్నాలలో చక్కటి హస్తకళ, నాణ్యతకు ప్రసిద్ధి చెందింది. 60 సంవత్సరాల విశ్వాసంతో, ఈ బ్రాండ్ దక్షిణ భారతదేశం, సింగపూర్‌లో 62 ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతోంది. అంతేగాక ప్లాటినం ఆభరణాల విభాగంలో తన అగ్రస్థానాన్ని నిలుపుకుంటూ 'ప్లాటినం ఛాంపియన్స్ లీగ్‌లో ఆరు ప్రతిష్ఠాత్మక టైటిళ్లను సాధించింది. ఇటీవల ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ (పీజీఐ) నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక వేదికలో మొత్తం 8 టైటిళ్లకి నామినేట్ అయిన జీఆర్‌టీ.. ఆరు అవార్డులను గెలుచుకుని మరోసారి తన శ్రేష్ఠతను నిరూపించుకుంది. 2017 నుంచి 2023 వరకు ఈ సంస్థ యేటా నాలుగు అవార్డులను స్థిరంగా గెలుచుకుంటూ ప్లాటినం విభాగంలో తన ఆధిక్యతను ప్రదర్శిస్తోంది. చెన్నైలోని కోట్స్ రోడ్ షోరూం నేషనల్ ఛాంపియన్ ట్రోఫీని, ఉస్మాన్ రోడ్ సౌత్ రీజనల్ ఛాంపియన్ టైటిల్‌ను, తాంబరం ఛాలెంజర్ ట్రోఫీని గెలుచుసుకున్నాయి.

రవాణా శాఖను ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదు

- మంత్రి శివశంకర్



కండక్టర్లుగా నియమితులైన మాజీ ఉద్యోగుల వారసులు

పెరంబూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖను ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని రవాణా శాఖ మంత్రి శివశంకర్ స్పష్టం చేశారు. కోయంబత్తూర్ సుంగం ప్రాంతంలో శనివారం 13 కొత్త బస్సుల ప్రారంభం, 41 మంది రవాణా శాఖ ఉద్యోగుల వారసులకు ఉద్యోగ నియామకపత్రాలు అందించే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా రవాణా శాఖ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. పొంగల్, దీపావళి తదితర పండుగల సమయంలో వారు విధులకు హాజరవుతూ ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారను. రవాణా శాఖ ఉద్యోగుల కృషితో 19 అవార్డులను కైవసం చేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో, రవాణా శాఖను ప్రైవేటుపరం చేస్తారని కొందరు వదంతులు సృష్టిస్తున్నారన్నారు. రవాణా శాఖలో 487 ఖాళీ పోస్టులు భర్తీ చేయడంతో పాటు మరో 2,000 మందికి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. కారుణ్య ప్రాతిపదికన 1,000 మందిని నియమించామన్నారు. యేటా అదనంగా రూ.1,000 కోట్లు రవాణా శాఖకు కేటాయిస్తున్నామన్నారు. గతంలో పాత బస్సులు నడిపేవారని, ప్రస్తుతం విడతల వారీగా కొత్త బస్సులు నడపనున్నామన్నారు. ప్రజా శాఖ గానే రవాణా శాఖ పనిచేస్తోందని, ప్రైవేటు పరం చేసే ప్రసక్తే లేదన్నారు. ప్రస్తుతం రవాణా శాఖలో మహిళలను కండక్టర్లుగా నియమిస్తున్నట్లు మంత్రి శివశంకర్ తెలిపారు.

'వా వాత్తియార్' మరింత ఆలస్యం!

కార్తి - కృతిశెట్టి జంటగా నటించిన తాజా చిత్రం 'వా వాత్తియార్'. 2023లో సెట్స్‌పైకి తీసుకెళ్లగా గత యేడాది మే నెలలో టైటిల్‌ను అధికారికంగా వెల్లడించారు. దీంతో వచ్చే యేడాదిలోనే ఈ సినిమా విడుదల చేస్తారనే ప్రచారం జరిగింది. అయితే, ఈ సినిమా చిత్రీకరణ పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో ఇప్పట్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. దీనికి కారణం మరో 20 రోజుల పాటు చిత్రీకరణ మిగిలివుందని కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ షూటింగుపై ఎపుడు పూర్తి చేస్తారన్నది ఇపుడు ప్రశ్నార్థకంగా మారింది. మిగిలిన చిత్రీకరణ పనులు పూర్తి చేసి సినిమాను విడుదల చేసేందుకు కూడా నిర్మాత ఆసక్తి చూపకపోవడం కూడా మరో కారణంగా ఉంది. ఇంకోవైపు హీరో కార్తి 'సర్దార్-2' షూటింగులో బిజీగా ఉన్నారు. ఈ మూవీ షూటింగు పూర్తి చేసి, వేసవిలో విడుదల చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. దీంతో కార్తి దృష్టంతా 'సర్దార్-2'పైనే ఉంది. 'వా వాత్తియార్' సినిమా ఇప్పట్లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం లేదు.



'వా వాత్తియార్'లో కార్తి - కృతిశెట్టి

విభిన్న వ్యక్తుల సంగమమే 'పూంగా'

'పూంగా' (పార్క్) అనేది కేవలం వినోదం అందించే ఒక ఉద్యానవనం మాత్రమే కాదనీ, ఇది ఒక జీవనశైలి, విభిన్న వ్యక్తులు సమావేశ స్థలం అని దర్శకుడు కేపీ ధనశేఖర్ అంటున్నారు. అళగు మూవీస్ పతాకంపై రూపొందిన చిత్రం 'పూంగా'. కౌశిక్, ఆరా హీరో హీరోయిన్లుగా నటించారు. ఇతర పాత్రల్లో శశిదయ, ప్రాణ, బాలసుబ్రమణియం, పూంగా రాము, దిండిగల్ మణికంఠన్, నోయన్ రెజీ, మేజిక్ శరవణన్, స్మాల్ రాజా, సాయ్ బేబీ తదితరులు నటించారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం కేపీ ధనశేఖర్. ఆర్‌హెచ్.అశోక్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి అహ్మద్ విక్కీ సంగీతం. ఈ సినిమా వివరాలను దర్శకుడు వివరిస్తూ... స్వర్గం ఆకాశంలో ఉందని అంటారు. కానీ, స్వర్గం భూమిపై ఉద్యానవనంలోనే ఉందని అంటారు. ఓ జంట కొన్ని సమస్యలతో పార్కుకు వస్తుంది. వారి సమస్యలు అక్కడ పరిష్కారమయ్యాయా లేదా అన్నదే ఈ చిత్ర కథ' అని పేర్కొన్నారు.



'పూంగా'లో ఓ దృశ్యం

'జైలర్' షూటింగ్‌లో నీలాంబరి!



రమ్యకృష్ణ

సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'జైలర్' రెండో భాగం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇందులో సీనియర్ నటి రమ్యకృష్ణ పాల్గొన్నారు. కోయంబత్తూరుతో పాటు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ పనులు సాగుతున్నాయి. ఇందులో రజనీకాంత్ తొలి భాగంలో నటించిన ముత్తువేల్ పాండియన్ కథాపాత్రలోనే నటిస్తున్నారు. ఆయన కోడలిగా మిర్నా మేనన్, భార్యగా రమ్యకృష్ణ నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీ షూటింగులో పాల్గొన్న రమ్యకృష్ణ తన ఇన్‌స్టా పేజీలో ఓ పోస్ట్ చేశారు. 'జైలర్-2' షూటింగులో ఈనెల 10వ తేదీ నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నా. అదే రోజున నేను సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి నటించిన 'పడైయప్పా' విడుదలై 26 యేళ్ళు పూర్తయినట్టు తెలిసింది. ఇలాంటి శుభతరుణంలో మళ్లీ రజనీతో కలిసి ఆయన సినిమా షూటింగులో ఉండటం ఎంతో సంతోషం కలిగించింది' అని పేర్కొన్నారు. కాగా, సన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత కళానిధి మారన్ ఈ మూవీని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ఏ దర్శకుడూ ముందుకురాలేదు

- ఎస్.ఏ.చంద్రశేఖర్

తమిళ చిత్రజ్యోతి



తన కుమారుడు విజయ్ సినిమాల్లో రావాలని ఆశ పడినపుడు దర్శకత్వం వహించడానికి ఏ ఒక్క దర్శకుడు ముందుకురాలేదని ప్రముఖ దర్శకుడు, నిర్మాత ఎస్.ఏ. చంద్రశేఖర్ వెల్లడించారు. దీంతో మరోమార్గం లేక విజయ్‌ను తానే డైరెక్ట్ చేశానని చెప్పారు. నగరంలో జరిగిన ఓ ఆడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... '1990వ దశకంలో దర్శకుడిగా ఎంతో బిజీగా ఉన్నా. ఆ సమయంలో నా కుమారుడు విజయ్ సినిమాల్లోకి రావాలని ఆశపడ్డాడు. అయితే, నేను డైరెక్ట్ చేస్తే బాగుండదని భావించి, విజయ్ ఆల్బమ్‌లు చేత పట్టుకుని పలువురు దర్శకుల కార్యాలయాలు చుట్టూ తిరిగా. కానీ, ఏ ఒక్క దర్శకుడు కూడా విజయ్‌ను డైరెక్ట్ చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో మరోమార్గం లేక నేనే దర్శకత్వ బాధ్యతలు చేపట్టా. కానీ, యువకుడైన తన కుమారుడిని మరో యువ దర్శకుడే డైరెక్ట్ చేయాలని తలచిన దర్శకుడు తంగర్ బచ్చన్.. ఎంతో తెలివిగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకున్నారు. ఒక యువ దర్శకుడు దర్శకత్వంలోనే తంగర్ బచ్చాన్ కుమారుడు విజయ్ బచ్చన్ హీరోగా నటించడం అతని అదృష్టం' అని ఎస్ఏ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు.







వీధుల్లో సంచరించే పశువులకు ఆశ్రయం

రాయపురంలో ఆధునిక వసతులతో కేంద్రం

ప్యారీస్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరవీధుల్లో వాహనాల రాకపోకలకు, పాదచారులకు అంతరాయం కలిగించేలా సంచరిస్తున్న పశువులకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆశ్రయం కల్పిస్తోంది. పట్టుబడిన స్థానిక రాయపురంలో ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలిస్తోంది. అన్నాసాలై, ఈవీఆర్ పెరియార్ సాలై, జీఎస్టీ రోడ్డు, తదితర ప్రధాన రోడ్లు, మధురవాయల్ నుంచి కోయంబేడు వరకు ఉన్న రహదారుల్లో ఓడరేవు వైపు వెళ్ళే భారీ వాహనాలు, బస్సుల మార్గంలో పశువులు సంచరిస్తున్న కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా రోడ్లపై నడిచివెళ్ళే పాదచారులను కొమ్ములతో పొడిచి గాయపరచిన సందర్భాలూ ఉన్నాయి. దీంతో పశువులపై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ దృష్టి సారించింది. రోడ్లపై సంచరిస్తూ పట్టుబడిన పశువుల యజమానులకు మొదటిసారి రూ.10వేలు, రెండో సారి రూ.15వేలు చొప్పున అపరాధం వసూలు చేస్తున్నప్పటికీ పశువుల బెడద తగ్గడం లేదు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు సుమారు 400కు పైగా పశువులను పట్టుకుని వాటి యజమానులకు హెచ్చరిక నోటీసులను జీసీసీ పంపిణీ చేయడం గమనార్హం. ఇదిలావుండగా వీధుల్లో సంచరిస్తున్న పశువులను పట్టుకుని వాటిని సంరక్షించేందుకు జీసీసీ రాయపురం జోన్ కార్యాలయం సమీపంలో ఆధునిక వసతులతో ఆశ్రయ కేంద్రం నిర్మితమవుతోంది. ఇక్కడ 250 నుంచి 600 పశువులను సంరక్షించేలా వసతులు సమకూరుస్తున్నారు. ఈ కేంద్ర చుట్టూవున్న గోడలు, లోపలవున్న గోడలపై ప్రకృతికి సంబంధించిన పెయింటింగులు ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు పశువులను పోషించుకునేందుకు తగిన స్థలంలేక ఇబ్బందులు పడుతున్న వాటి యజమానులు రాయపురం పశువుల కేంద్రానికి తరలించవచ్చని ప్రకటించిన జీసీసీ.. ఇందుకోసం రోజుకు రూ.10 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.



జస్టిస్ ఎస్ఎస్ సుందర్

శ్రీవారి సేవలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎస్ సుందర్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో జస్టిస్ సుందర్‌కు ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



చెన్నైలోని గ్లెనెగ్లెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కాలేయ మార్పిడి చికిత్సా వైద్య నిపుణుల రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా శనివారం ప్రొఫెసర్ కేఆర్ పళనిస్వామి, డాక్టర్ ఎ.జయంతికి 'ప్రొఫెషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్'ను ప్రదానం చేస్తున్న కేంద్రమంత్రులు డాక్టర్ జితేందర్‌సింగ్, డాక్టర్ ఎల్.మురుగన్ తదితరులు

తిరువణ్ణామలై బస్సుల్లో రద్దీ




పౌర్ణమి సందర్భంగా తమిళనాడు తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు వెళ్లే ప్రయాణికులతో సీబీఎస్‌లో శనివారం రద్దీ ఏర్పడింది. వరుసగా మూడు సెలవులు రావడంతో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీట్లకోసం బస్సుల వెంబడి పరుగులు తీయడం కనిపించింది. కాగా, తిరుమలలో తుంబురతీర్థం, తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు కేటాయించడంతో ఇతర ప్లాట్‌ఫామ్స్‌లో బస్సుల కొరత ఏర్పడింది. దీంతో గంటల తరబడి నిరీక్షణ తప్పలేదు. ఎండ తీవ్రతకు అవస్థలు పడాల్సి వచ్చింది.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి

తిరువణ్ణామలై బస్సులో సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

'ఛాంపియన్' 50 శాతం షూటింగ్ పూర్తి


● హీరో రోషన్



తాను నటిస్తున్న 'ఛాంపియన్' చిత్రం షూటింగ్ 50 శాతం పూర్తయిందని హీరో రోషన్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. హనుమాన్ జయంతి రోజున శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. నటుడు శ్రీకాంత్ కుమారుడు కూడా అయిన రోషన్‌ను చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఆళ్వార్ ట్యాంక్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.01 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,462

తలనీలాలు సమర్పించినవారు : 25,393

క్రికెట్ కేరాఫ్... వెంకటగిరి

వెంకటగిరి, ఆంధ్రజ్యోతి



వెంకటగిరిలో క్రికెట్ పూర్వ వైభవాన్ని సంతరించుకుంటోంది. 135ఏళ్ల క్రితమే ఉనికి చాటుకున్న క్రికెట్ మళ్లీ ఆ దిశగా పరుగులు తీస్తోంది. కాసింత ప్రోత్సాహమిస్తే రంజీక్రీడలకు సైతం ఆతిథ్యమిచ్చేందుకు ఇక్కడి క్రీడా మైదానం సిద్ధమవుతోంది. నాడు రాజుల చొరవతో జాతీయ స్థాయి క్రీడాకారులు ఆడిన ఈనేల మళ్లీ క్రికెట్ వినోదాన్ని పంచేందుకు వేదికవుతుందనడం నిస్సందేహం. క్రికెట్‌కూ వెంకటగిరికీ ఉన్న అనుబంధాన్ని ఒకసారి పరిశీలిస్తే..

గతమెంతో ఘనం ...

క్రికెట్ ఊసే ఎరుగని రోజుల్లో వెంకటగిరిలో ఆ ఆట ఆడేవారంటే విస్మయం కలుగుతుంది. అప్పట్లో ఇంగ్లాండ్‌లో ప్రభువుల క్రీడగా గుర్తింపు పొందిన ఈఆటను ఇక్కడి ప్రాంతానికి పరిచయం చేశారు వెంకటగిరి రాజాలు. 1890లో 28వ తరం రాజు గోపాలకృష్ణ యాచేంద్ర(బొమ్మదొర) స్థానిక నగరి ప్రాంగణంలోని ఇసుకలో క్రికెట్ ఆడేవారు. తర్వాత తరాలు ఈఒరవడి కొనసాగించాయి. ఆ స్ఫూర్తితో 1940లో స్థానికులు వెంకటగిరి క్రికెట్ క్లబ్(వీసీసీ)ను ఏర్పాటుచేశారు. ఈ జట్టుకు జగన్నాథ ప్రసాద్ కెప్టెన్‌గా సారథ్యం వహించారు. ఆంధ్రా జట్టుకు కొన్నాళ్లు కెప్టెన్‌గా వ్యవహరించిన వీవీవీఆర్కే యాచేంద్ర తమ సంస్థానం పేరుతో మరో క్రికెట్ క్లబ్‌ను స్థాపించారు. 1944లో రంజీ క్రీడాకారులున్న విజయనగరం జట్టుతో వెంకటగిరి జట్టు తలపడింది. ఏజీ రాంసింగ్‌తో పాటు ప్రముఖ క్రీడాకారులు కె.ఎస్.కన్నన్, సి.ఎస్.నాయుడు, ఆంధ్రా మాజీ కెప్టెన్ కె.చంద్రశేఖర్‌రావు వంటి తలపండిన క్రీడాకారులు వెంకటగిరి ఆటగాళ్లకు కోచ్‌లుగా వ్యవహరించారు. 1947లో ఇంగ్లాండ్ క్రీడాకారుడు లెస్ వెన్సిలిన్ కూడా వచ్చి శిక్షణ ఇచ్చారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన వారిలో వీవీవీఆర్కే యాచేంద్ర, వీజీకే యాచేంద్ర, రాజగోపాల యాచేంద్రలు ఆంధ్రాజట్టుకు సారథ్యం వహించారు. కాలక్రమంలోక్రికెట్ కోసం రాజాల ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్ ఏర్పాటైంది. 1953 ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆవిర్భావం వెనుక వెంకటగిరి రాజాలు కీలక భూమిక పోషించారు. ఇక్కడి మైదానంలో 1950-1951 మధ్య ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సిటి మఫ్‌సిల్ స్టేట్ సెలక్షన్ మ్యాచ్‌లు, 1954లో క్రికెట్ బోర్డు సెక్రటరీస్ మ్యాచ్‌లు, 1954-56 మధ్య ఇంటర్ జోనల్ మ్యాచ్‌లు జరిగాయి.



జింఖానా గ్రౌండ్‌లో మ్యాచ్ (ఫైల్ ఫొటో)

అప్పటినుంచి 1982 వరకూ జిల్లా,రాష్ట్ర స్థాయితోపాటు రంజీపోటీలు కూడా జరిగాయి. 1981లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ మైదానంలో టర్ఫ్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో మునిస్వామి, ఆర్. జగదీష్, వి.జి.కె.యాచేంద్ర, జి.ఎ. ప్రతాప్‌కుమార్, టి. శ్రీధర్, వి.సత్యప్రసాద్ యాచేంద్రలతో పాటు మరికొందరు రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా రాణించారు. తర్వాత జింఖానా గ్రౌండ్, అందులోని భవనాన్ని బయటవ్యక్తులు కొనుగోలు చేశారు. కొనుగోలుదారులు తమ అవసరాలకు అనుగుణంగా మైదానాన్ని మార్చి,భవనాన్ని కూల్చి వేయడంతో ఇక్కడ క్రికెట్ ఉనికి కోల్పోయింది. వేదిక లేక క్రికెట్ బోసిపోయింది.

క్రికెట్‌కు పూర్వ వైభవం

1996లో వీవీవీ ఆర్కే యాచేంద్ర క్రికెట్‌కు మళ్లీ ప్రాణప్రతిష్ఠ చేయాలని సంకల్పించారు. ఆయన కృషి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్పోర్ట్స్ అథారిటీ నిధులతో ఏర్పేడు-వెంకటగిరి రోడ్డు మార్గంలో పదెకరాల విస్తీర్ణంలో తారకరామా క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటైంది. కుమార్‌రాజా వీజీకే యాచేంద్రకు క్రికెట్‌పై ఉన్న మక్కువ, రాజాలకు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్‌లో పట్టు ప్రభావంతో ఈ గ్రౌండులో రెండు టర్ఫ్‌పిచ్‌లను ఏర్పాటయ్యాయి. ఏసీసీ నిర్వాహకులు ఈ క్రీడా ప్రాంగణంలో మెరుగైన సదుపాయాలను కల్పించడంతో సహకరించారు. దీంతో అంతర్జాతీయ ప్రమాణాల్లో ఇక్కడ క్రీడా ప్రాంగణం రూపుదిద్దుకొంది. సౌత్ జోన్ రాష్ట్ర ఎంపికలతో పాటు 800పైగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు అండర్-14, అండర్-16, అండర్-22కి ఎంపికై రాష్ట్ర జట్టులో ప్రతిభను కనబరిచారు. ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు ఏసీసీ ధనుంజయ్‌ను కోచ్‌గా నియమించింది. ఇక్కడ రోజూ 30మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. మరోపక్క రంజీ స్థాయి మ్యాచ్ ఆడేలా గ్రౌండును తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల కుమార్‌రాజా వి.జి.కె. యాచేంద్ర వద్ద శిక్షణ పొందిన ప్రజిత్, రాజేశ్వరరెడ్డి, దినేష్, సుబ్రమణ్యంలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి,రంజీమ్యాచ్‌ల నిర్వహణకు ఇక్కడి మైదానం అనువుగా ఉంటుందని క్రికెట్ నిపుణులు చెబుతున్నారు. కొంచెం శ్రద్ధ పెడితే గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేయవచ్చునంటున్నారు. .




- ● 1890లోనే ఉనికి చాటుకున్న క్రికెట్
- ● నాటి రోజుల్లోనే రంజీ ప్లేయర్ల రాణింపు
- ● పూర్వ వైభవం దిశగా మళ్లీ అడుగులు



తారకరామా మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువకులు

ఆరు దశాబ్దాల క్రితమే రాజగోపాల్ సారథ్యం



రాజగోపాల్ యాచేంద్ర

వెంకటగిరి సంస్థాన రాజ కుటుంబానికి సమీప బంధువు వెలుగోటి రాజగోపాల్ యాచేంద్ర(94) కన్నుమూశారనే వార్త ఇక్కడి క్రికెట్ అభిమానులను విషాదంలో ముంచింది. రాజగోపాల్ ఆంధ్ర తరఫున కెప్టెన్‌గా 15 ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడారు. 1956-1957లో ట్రావెన్ కోర్-కొచ్చి జట్టుతో గుంటూరులో జరిగిన మ్యాచ్‌లో రంజీ క్రీడాకారుడిగా రంగ ప్రవేశం చేశారు. 1964- 1965లో హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. 1965-1967లో చెన్నై వెళ్లి సినీ నిర్మాణ రంగంలో ప్రవేశించారు. ఇదాలోకం, జేబుదొంగ, మల్లెపువ్వు సినిమాలకు నిర్మాణసారథ్యం వహించారు. 1999-2000లో నెల్లూరు తిరిగి వచ్చారు. ఈక్రమంలో అనారోగ్యంతో గురువారం తుదిశ్వాస విడిచారు.

తిరుమల మరుగుదొడ్డిలో విషపూరిత పాములు



తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):తిరుమలలోని ఓ మరుగుదొడ్డిలో శనివారం విషపూరితమైన పాములు పట్టుబడ్డాయి. శ్రీవారి పాదాల వద్దనున్న మరుగుదొడ్డి పైభాగంలోని రేకుల్లో పాములు ఉండటాన్ని భక్తులు గుర్తించారు. సమీపంలోని భద్రతాసిబ్బంది సహకారంతో పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. పట్టుబడిన పాములు పచ్చకట్ల పాములని, ఇవి చాలా ప్రమాదకరమైనవని ఆయన తెలిపారు.

సామాన్యుడిలా నెహ్రూ తలనీలాల సమర్పణ



తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ సామాన్య భక్తులతో కలిసి తలనీలాలు సమర్పించారు. శనివారం ఉదయం తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం-1కి వెళ్లిన ఆయన భక్తులతో పాటే తలనీలాలు సమర్పించారు. అనంతరం కల్యాణకట్టలో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సేవలందించాలని సిబ్బందికి సూచించారు.అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు.

వేసవి నుంచి ఉపశమనం

తిరుమల మాడవీధుల్లో తెరతో పైకప్పు ఏర్పాటు



మాడవీధుల్లో ఏర్పాటు చేస్తున్న పైకప్పు

తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు వేసవి వేడి నుంచి ఉపశమనం కల్పించేలా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. సాధారణంగా శ్రీవారి ఆలయ మాడవీధుల్లో పాదరక్షలతో తిరగడం నిషేధం. ఈ క్రమంలో చాలా మంది భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండానే నడుస్తుంటారు. కూలింగ్ పెయింట్ వేసినప్పటికీ ఎండలు పెరిగిన క్రమంలో నడవలేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఆగచాట్లు పడుతున్నారు. ఈ క్రమంలో టీటీడీ మాడవీధుల గ్యాలరీలు కలిసేలా ఆకుపచ్చటి తెరలతో తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. దీంతో భక్తులకు కాస్త ఉపశమనం లభిస్తోంది.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన టెంపో

● ఆరుగురికి స్వల్పగాయాలు



తిరుమల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో శనివారం ఓ వాహనం అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. చెన్నైకు చెందిన భక్తబృందం శ్రీవారిని దర్శించుకుని శనివారం సాయంత్రం తమ టెంపోలో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి మలుపు వద్ద వాహనం అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. దీంతో ఆరుగురు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. మిర్యాలగూడకు చెందిన ఓ కుటుంబం ప్రయాణిస్తున్న కారు 13వ మలుపు వద్ద అదుపుతప్పింది. క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొంది. ఒకరు గాయపడ్డారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల నగరోత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల నగరోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముక్కంటి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వారం రోజుల పాటు సాగిన పెద్దకొట్టాయి ఉత్సవం పౌర్ణమితో ముగిసింది.

పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవారు

అది పరువు హత్యే

●యువతి మృతి కేసులో వీడిన మిస్టరీ



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నరసింగాపురంలో యువతి మృతి కేసులో మిస్టరీ వీడింది. పరువు హత్యగానే తేలింది. కూతురు తన మాట విననందుకు చివరికి తల్లే కడతేర్చింది. శనివారం రాత్రి విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ప్రసాద్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. నరసింగాపురం గ్రామానికి చెందిన యువతి(16) రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం హరిజనవాడకు చెందిన అజయ్‌లు ప్రేమించుకున్నారు. ఈక్రమంలో నిఖిత గర్భం దాల్చింది. దీనిపై ఆమె తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అజయ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన అజయ్‌ను సదరు యువతి మళ్లీ కొద్ది రోజులుగా కలుస్తోంది. ఇతర కులస్థుడుని ప్రేమించడాన్ని వ్యతిరేకించిన సుజాత తన కుమార్తెను మందలించింది. అయినా తల్లి మాటలేదు. దీంతో తల్లి ఆగ్రహంతో కుమార్తెను కొట్టి ముక్కు, నోరు మూసేసింది. ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసింది. దీనిని సహజ మరణంగా చిత్రీకరించేందుకు యువతి తల్లి ప్రయత్నించింది. పోలీసుల విచారణలో ఈ విషయం ఒప్పుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. కేసును 72 గంటల్లో ఛేదించినందుకు పోలీసులు గోపి, మునిరత్నం, పురందర్, సీసీఎస్ కానిస్టేబుల్ రవిప్రకాష్‌లను అభినందించారు. రివార్డులను అందించారు. సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐ అనిత, పాల్గొన్నారు.

ఐడబ్ల్యూఎన్ ఏపీ చాప్టర్

చైర్‌పర్సన్‌గా చాందిని, వైస్‌గా ఉష



కమిషనర్ మౌర్యను సత్కరిస్తున్న ఐడబ్ల్యూఎన్ ప్రతినిధులు

తిరుపతి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)అనుబంధంగా ఉన్న ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యుఎన్) ఏపీ చాప్టర్ 2025-26 సంవత్సరానికి కొత్త ఆఫీస్ బేరర్లను శనివారం ఓ హోటల్లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అవెరా ఏఐ మొబిలిటీ సహ వ్యవస్థాపకురాలు చాందిని చందన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌గా ఉష నియమితులయ్యారు. ఈ సందర్భంగా సహకార శక్తితో పురోగతిని వేగవంతం చేయడమన్న అంశంపై ఒక సదస్సు నిర్వహించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా వీసీ ఎన్. మౌర్య పాల్గొని ప్రసంగించారు. అన్ని రంగాలలో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం గురించి వివరించారు. సీఐఐ ఏపీ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దార్శనికతతో ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త తయారుకావచ్చన్నారు. అనంతరం కమిషనర్ మౌర్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గల్లా రమాదేవి, మహిళా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

తుంబురతీర్థానికి పోటెత్తిన భక్తులు

సందర్శించిన 14,500 మంది భక్తులు

తిరుమల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శేషాచల అడవుల్లో ప్రముఖ తీర్థంగా భాసిల్లుతున్న తుంబుర తీర్థానికి భక్తులు పోటెత్తారు. శనివారం 14,500 మంది భక్తులు దర్శించుకున్నారు. తుంబరు తీర్థ ముక్కోటి సందర్భంగా శుక్ర, శనివారాల్లో భక్తులను తీర్థానికి అనుమతించారు. శుక్రవారం 3,500 మంది, శనివారం 11 వేల మంది భక్తులు అడవుల్లోని తీర్థానికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి తుంబురనాథుడిని దర్శించుకున్నారు. టీటీడీ పటిష్ట ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా తీర్థాన్ని సందర్శించారు. గోగర్భం డ్యాం వద్ద భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు ఇవ్వడంతో పాటు వైద్య సేవలు అందించారు.

హిందూ ధర్మ రక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న వశిష్టాశ్రమ పీఠాధిపతి స్వరూపానందగిరి

శ్రీకాళహసి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మ ఆశ్రమంలో శనివారం వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి ఆధ్వర్యంలో ఆశ్రమ వార్షికోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సభలో వశిష్టాశ్రమ పీఠాధిపతి స్వరూపానందగిరి స్వామి ప్రసంగిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్ మాయలో చిన్నారుల భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని, ఈ మురికి కూపం నుంచి బయటకు రావడానికి ఆశ్రమాల్లో నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. హిందూ ధర్మ రక్షణకు ప్రతి కుటుంబం బాధ్యతగా భావించి ఒక సంతానానికి ఆశ్రమ విద్య అందించాలన్నారు. గృహస్థాశ్రమం నుంచి బిడ్డలు రాకపోతే హిందూ ధర్మం పరిరక్షణ మనుగడ ఎలా సాధ్యమన్నారు. జనాభా పెరుగుదల ఆవశ్యకతను ప్రభుత్వాలు గుర్తించి బిడ్డలను కనడంపై ఉన్న ఆంక్షలు ఎత్తివేశారని గుర్తు చేశారు. అనంతరం విశేష పూజలు, భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

శ్రీధర్స్ విద్యార్థుల జయకేతనం



శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో జయకేతనం ఎగురవేశారని చైర్మన్ మద్దినేని శ్రీధర్ పేర్కొన్నారు. ప్రథమ ఎంపీసీలో ఉమామహేశ్వర్ 465 మార్కులు, నిత్య శ్రీకళ్యాణి, లీనాశ్రీ 464, శ్రీకర్‌రెడ్డి 463, యామిని, పనుష్య, వాసవి, మానస 462, షామితరెడ్డి, యశ్విత 460 మార్కులు పొందారు. 37 మంది విద్యార్థులు 450కి పైగా మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీలో జ్యోష్నా 433, రక్షిత 426, దివ్య 422, ధన్యత, ప్రియదర్శిని 419 మార్కులు పొందగా 10 మంది 410కి పైగా మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్లో వన్షిక, మహ్మద్ ఇమ్రాన్ 987, నిఖిలేశ్వర్ 985, యుక్త 984, మహ్మద్ తాలిబ్, పోషిత 980 మార్కులు పొందగా 28 మంది 950కి పైగా మార్కులు సాధించారు. వీరిని అడ్మినిస్ట్రేటివ్ సీఈఓ వాణిశ్రీ, అధ్యాపకులు అభినందించారు.